క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



చిన్నగూడూరు: మండలంలోని మన్నెగూడెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ప్రారంభించారు. మంత్రి సత్యవతి రాథోడ్ సహకారంతో ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.5 లక్షలతో ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు వెంకట్ గౌడ్, సోమయ్య, వెంకన్న, మహేందర్, అశోక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



మహబూబాబాద్ రూరల్: డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, మార్కెట్ సెక్రెటరీ షంషీర్ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

మహిళా ఆరోగ్య క్లినిక్ ప్రారంభం



డోర్నకల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య క్లినిక్‌ను మంగళవారం మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ మాట్లాడుతూ.. వారంలో ఒక రోజు మహిళా క్లినిక్ ద్వారా మహిళలకు అన్నిరకాల పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కనకదుర్గ, సీహెచ్ఓ వీరబాబు, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే తెలియజేయాలి

మహబూబాబాద్: వర్షాల కారణంగా రోడ్డు సమస్యలు ఉంటే తెలియజేయాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో గల అయ్యప్పనగర్ కాలనీలో రోడ్డు గుంతలకు మరమ్మతులు, భగీరథ లీకేజీ పనులు చేయించారు. కార్యక్రమంలో శరత్, ఎడ్ల శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థినులకు పతకాలు



బయ్యారం: ఖమ్మంలో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ వెయిట్ లిఫ్టింగ్‌లో నామాలపాడు ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థినులు 18 పతకాలు సాధించి సత్తా చాటారు. ఖమ్మంలో సోమవారం ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో బాలికలు 7 గోల్డ్ మెడల్స్, 5 సిల్వర్ మెడల్స్, 6 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథి రెడ్డి, అంగన్‌వాడీ యూనియన్‌ల నాయకులు ఎల్లారీశ్వరీ, బిందు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు సమ్మె చేపట్టారు. కాగా వారు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేషపల్లి నవీన్, నాగన్న, శ్రావణ్, పెరుగు కుమార్, లలిత, లక్ష్మి, నర్సమ్మ, ప్రేమలత, అండాలు, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడ: అంగన్‌వాడీలో పనిచేస్తున్న కార్యకర్తలు, ఆయాల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. దీక్షల్లో సమ్మక్క, శ్రీలత, వనిత, స్వరూప, మౌనిక, లలిత,లక్ష్మి, వీరలక్ష్మి, శాంత, యాకమ్మ, అరుణ, పద్మ, సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలో దీక్షాశిబిరం వద్ద ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ నక్క సైదులు, సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి సైదులు, గుగులోత్ సరోజ, కవిత, సంధ్య కుమారి, సీపీఎం నాయకులు షేక్ మల్సూర్, మాలోత్ కిషన్‌నాయక్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

గార్ల: గార్లలో సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ నాయకులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, గుండా వెంకట్‌రెడ్డి, దనియాకుల రామారావు, తదితరులు ఉన్నారు.

మరిపెడ: మండలకేంద్రంలో దీక్షలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ పాల్గొని మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.



మహబూబాబాద్: సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు



కురవి: దీక్షకు మద్దతు పలుకుతున్న నాయకులు

గూడూరు: తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు తిరుపతమ్మ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం ప్రతినిధులు రఫియాబేగం, స్వరూప, లలిత, పారిజాతం పాల్గొన్నారు.

తొర్రూరు: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు బొల్లం అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. మంగళవారం డివిజన్ కేంద్రంలో నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ యాకూబ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



గార్ల: దీక్షకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



మరిపెడలో మాట్లాడుతున్న ఉపేందర్



గూడూరులో..

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

గూడూరు: ప్రతీ ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచుతూ, అడవులను కాపాడుకుంటూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని హెచ్ఎం స్వరూప అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో మంగళవారం ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఐయర్ సందర్భంగా యంగ్ ఎర్త్ లీడర్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. చదువుతో పాటు మొక్కలు పెంచడం, పర్యావరణ పరిరక్షణపై బాధ్యత కల్గి ఉండాలని సూచించారు. అదేవిధంగా హైస్కూల్ నియమితులైన 8 మంది యంగ్ ఎర్త్ లీడర్‌లకు వారి బాధ్యత, పర్యావరణ పరిక్షణపై ప్రతిజ్ఞ చేయించి, వారికి బ్యాడ్జీలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారాణి, జయశ్రీ, రాజ్యలక్ష్మి,రమాదేవి పాల్గొన్నారు.



గూడూరు: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం స్వరూప

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

తొర్రూరు రూరల్: ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్ఎం లక్ష్మినారాయణ కోరారు. మంగళవారం మండలంలోని అమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులతో శ్రీ సోమేశ్వర గోశాల వారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మహేష్ అగర్వాల్, పీఎస్ హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసముద్రం: వాతావరణాన్ని కాలుష్యం చేసే ప్లాస్టిక్‌ను నివారించాలంటూ ఇనుగుర్తి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులకు సన్మానం



ఎన్నికైన అధ్యక్షులను సన్మానిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్/గూడూరు: నెల్లికుదురు, గూడూరు బ్లాక్ కాంగ్రెస్ పార్టీల అధ్యక్షుడిగా ఎదళ్ల యాదవరెడ్డి, కత్తి స్వామి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా నియామకం అయిన రాంశెట్టి వీరేందర్‌ను మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అర్బన్ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. గూడూరులో కత్తిస్వామితోపాటు అనుబంధ సంఘాల మండల అధ్యక్షుడు ఎన్నికైన ఎస్సీ సెల్ కందిక శంకర్, ఎస్టీ సెల్ బాలునాయక్, బీసీ సెల్ రాజులపాటి యాకయ్య, మైనార్టీ సెల్ సయ్యద్ హుస్సేన్, కిసాన్ సెల్ యాకాంబ్రం, ఎన్ఎస్‌యూఐ భూక్య కిషన్‌లను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు చాంద్, శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్ నాయక్, వెంకన్న, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి శివకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్‌నాయక్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు యాకూపాషా అమరేందర్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, కొమ్మాలు, ఉప సర్పంచ్ శివరాత్రి సంపత్, ఎలమందల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోషకాహార లోపంతోనే ఆరోగ్య సమస్యలు

మహబూబాబాద్: పోషకాహార లోపంతోనే ఆరోగ్య సమస్యలు వస్తాయని అంగన్‌వాడీ టీచర్ చేపూరి సరిత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా భట్టు భద్రమ్మ పాల్గొన్నారు.

కురవి: మండలంలోని బలపాల శివారు లింగ్యాతండా గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషక వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు కుమారి, దేవమణి మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయాలు విజయ, కొంటి, ఆశవర్కర్లు రాంబాయి, కల్పన పాల్గొన్నారు.



మహబూబాబాద్: అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ సరిత

వారోత్సవాలను అధికారికంగా నిర్వహించాలి



తొర్రూరు: నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తొర్రూరు: తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి డిమాండ్ చేశారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని వారోత్సవాలను పురస్కరించుకొని సాయుధ పోరాట యోధుడు మన్నూరు వెంకటయ్య స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు విశేశ్వర్‌రావు, మహేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

డోర్నకల్: సెప్టెంబర్ 17న నిర్వహించే తెలంగాణ విముక్తి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శెట్టి వెంకన్న కోరారు. తెలంగాణ విముక్తి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో మండలంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకటరెడ్డి. దాసరి మల్లేశం, శ్రీనివాస్, రవి, బాబు పాల్గొన్నారు.

ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్లు

మహబూబాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల కోసం పలు డిక్లరేషన్లు అమలు చేస్తుందని అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య అన్నారు. మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంజయ్య మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తల్లి సోనియా గాంధీ సెప్టెంబర్ 17న హైదరాబాద్ తుక్కుగూడ విజయభేరి బహిరంగ సభలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు పలు డిక్లరేషన్లు ప్రకటిస్తారన్నారు. సమావేశంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు రాంశెట్టి వీరేందర్, జిల్లా నాయకులు నర్సింగ శ్రీనివాస్ యాదవ్, ఎస్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు బానోత్ ప్రసాద్ నాయక్, బండి వెంకన్న, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి అంబాల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: మాట్లాడుతున్న అంజయ్య

గార్ల: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే విజయభేరీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వర్తకసంఘం భవనంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఝాన్సీలక్ష్మి, వెంకట్‌రెడ్డి, రాముగౌడ్, భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ఖానాపురం : తెలంగాణలోని ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం వీఓఏలకు జీతాల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలకు ఇచ్చిన హామీలో భాగంగా సీఎం కేసీఆర్ జీతాలు పెంచడం సంతోషంగా ఉందన్నారు.

నివాళి

గంగారం: మండల కేంద్రంలోని ఏహెచ్ఎస్ బాలికల పాఠశాల హెచ్ఎం యాకలక్ష్మీ తల్లి రామక్క మండలంలోని కామారం గ్రామంలో ఇటీవల మృతిచెందింది. మంగళవారం ఆమె చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్ ఏటీఎఫ్ జిల్లా నాయకులు రాంచంద్రు, ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సు, భద్రాద్రి జిల్లా టీఎస్ ఏటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చాపల రమేష్‌బాబు పాల్గొన్నారు.

హామీలను నిలుపుకోని ప్రభుత్వాలు



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నెల్లికుదురు: ఇంటికో ఉద్యోగం ఇస్తానని కేసీఆర్ ప్రభుత్వం, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాని మోదీ హామీలు ఏమయ్యాయని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఇరుగు అనిల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఈనెల 17న కేసముద్రం మండల కేంద్రంలో నిర్వహించే రెండో మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రంగయ్య, రాంప్రసాద్, బాలు, వెంకన్న, రామోజీ, మహేష్ పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



కురవి: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా అన్నారు. మండలంలోని మోద్గులగూడెం గ్రామంలో సంఘం సమావేశం రడం సారయ్య అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు, మైనార్టీలకు ఇచ్చిన విధంగా దివ్యాంగులకు రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సీతయ్య, రడం గౌరమ్మ, బత్తిని వెంకన్న, రవీందర్, మహేష్, పద్మ, మణెమ్మ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

నెల్లికుదురు: అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై క్రాంతికిరణ్ హెచ్చరించాడు. మండలంలోని మునిగలవీడు గ్రామ పరిధిలోని ఆకేరు వాగుకు వెళ్లే రహదారిపై జేసీబీ సహాయంతో కందకం తీయించాడు. అనంతరం ఎస్సై మాట్లాడారు. ఎవరైనా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

అందుబాటులో యూరియా

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు అందజేసేందుకు యూరియా పెద్దతండాలో అందుబాటులో ఉందని సొసైటీ కార్యదర్శి వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్‌కార్డు తీసుకొని వచ్చి యూరియా తీసుకెళ్లాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

తొర్రూరు: రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనా రాపోలు ప్రభాకర్, వేముల శ్రీనివాస్‌లను పద్మశాలీ సంఘం, వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రవి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు, ఉమేష్, ఉషా, పులేందర్, సోమయ్య, సోమశేఖర్ పాల్గొన్నారు.

పారదర్శకంగా జరగాలి

కొత్తగూడ: డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జిల్లా కలెక్టర్ల ద్వారా పారదర్శకంగా చేపట్టాలని ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ ర్యాలీలో నాయకులు జంపయ్య, రణధీర్, సారయ్య పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

కురవి: మరిపెడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఆడిటోరియంలో నేడు(బుధవారం) ఎమ్మెల్యే రెడ్యానాయక్ చేతులమీదుగా కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ సునీల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టై, బెల్ట్‌ల పంపిణీ

బయ్యారం: మండలం లోని గురిమెళ్ల ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి ప్లేట్లు, టై, బెల్ట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు శ్రీకాంత్, కృష్ణయ్య, ఎంపీటీసీ భద్రయ్య, హెచ్ఎం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా రామారావు



గార్ల: కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా తిరిగి దనియాకుల రామారావు నియమితులయ్యారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఎన్నికలు పూర్తయ్యేంత వరకు పాత కమిటీలనే కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పోదెం వీరయ్య తెలిపారు.

పాఠశాలకు తీసుకెళ్తున్న బాలిక అదృశ్యం

గార్ల: గార్ల ఆశ్రమ పాఠశాలలో 6వతరగతి చదువుతున్న బాలికను మంగళవారం ఇంటి నుంచి పాఠశాలకు తీసుకరాగా, దుకాణంలో తల్లి వస్తువులు కొనుగోలు చేస్తుండగా బాలిక అదృశ్యమైంది. బయ్యారం మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన పూనెం నరసింహరావు కూతురు గార్ల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతుంది. సెలవులకు ఇంటికి వచ్చింది. పాఠశాల హెచ్ఎం కోటేశ్వరి బాలికను పాఠశాలకు తీసుకరావాలని తల్లితండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు బాలికను గార్లకు తీసుకురాగా, కొన్ని వస్తువులు కావాలని బాలిక కోరడంతో దుకాణంలో తల్లి కొనుగోలు చేస్తుండగా వెనక నుంచి బాలిక అదృశ్యమైంది. బాలిక అదృశ్యమైన విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లితండ్రులు వెతకగా బాలిక స్వగ్రామమైన టేకులగూడెంలోని మిరుప తోటలో కనిపించింది. దీంతో బాలిక తల్లితండ్రులు పాఠశాల ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



మహబూబాబాద్: సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు విష్ణువర్ధన్, శ్రీశైలం, రవీందర్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం చేపట్టిన దీక్షకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాల్, రమేష్, మోహన్, ఖాదర్, వీరన్న పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



డోర్నకల్: స్థానిక చర్చి కాంపౌండ్‌లోని గ్రైవర్ మెమోరియల్ బదిరుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం మహారాష్ట్రలోని అంకోలాలో నివాసం ఉంటున్న శిల్కీజైన్ తన తండ్రి డోర్నకల్ 10వ వార్డు కౌన్సిలర్ కాలా సురేందర్‌జైన్‌తో కలిసి క్రీడా సామగ్రి అందజేశారు.

క్రైం కార్నర్..

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

నర్సింహులపేట: మండంలోని కౌసల్యదేవిపల్లి గ్రామానికి చెందిన కటుకూరి నరేష్‌రెడ్డి(45)అనే వ్యక్తి మంగళవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సతీష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నరేష్‌రెడ్డి నిత్యం మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండేవాడు. వ్యవసాయ పనులు చేయకపోవడంతో భార్య శ్రీలత ఎందుకు పనులు చేయడం లేదని మందలించడంతో క్షణికావేశంలో పురుగుల మందుతాగి అత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని రామచంద్రాపురం కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. టౌన్ సీఐ వై.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రామచంద్రాపురం కాలనీకి చెందిన పత్తి కృష్ణవేణి (28)కి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కృష్ణవేణి కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేక మనోవేదన గురవుతుంది. ఈ క్రమంలో ఆమె సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఇంటి వద్ద ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లగా అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలి మేనత్త కొడుకు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

గుండెపోటుతో రైతు..



జనార్దన్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: గుండెపోటుతో రైతు మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి గ్రామానికి చెందిన పిడుగు జనార్దన్ (49)కి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమారుడు ఉన్నారు. వ్యవసాయ పనుల కోసం జనార్దన్ పొలం పనులు చేస్తుండగా అక్కడే కుప్పకూలి పడిపోయాడు. గమనించిన స్థానిక రైతులు హుటాహుటిన చికిత్స నిమిత్తం మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. రైతును పరీక్షించిన వైద్యులు ఆయన మృతి చెందాడని ధ్రువీకరించారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

డోర్నకల్: డోర్నకల్ గొల్లచర్ల మార్గంలో సిమెంటు లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. మాచర్ల నుంచి ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు సమీపంలోని సీతారామ ప్రాజెక్ట్ క్యాంప్ ఆఫీస్‌కు సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ డోర్నకల్ దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న ఆటోని తప్పించే క్రమంలో రోడ్డు ప్రక్కన బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



కేసముద్రం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో సామగ్రి పూర్తిగా దగ్ధమైన సంఘటన మండలంలోని అర్పనపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన చెన్నబోయిన సతీష్ అనే వ్యక్తి, తన భార్యతో కలిసి కూలి పనికి వెళ్లగా, పిల్లలు స్కూల్‌కి వెళ్లారు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో, నిప్పురవ్వలు దుస్తువులపై పడటంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో ఉన్న బియ్యం బస్తాలు, వంట సామగ్రి, టీవీ, ఫ్యాన్‌లు, నిత్యావసర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. గమనించిన గ్రామస్తులు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు బంద్ చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటుంది.

బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే అభివృద్ధి



పెద్దవంగర: బీఆఆర్ఎస్‌ను ఓడిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం రెడ్డికుంట తండాకు ఉపసర్పంచ్ బానోతు కోబ్లా నాయక్ తిరిగి కాంగ్రెస్‌లో ఝాన్సీరెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, సర్పంచ్ జగ్గా నాయక్, యాకుబ్, తదితరులు పాల్గొన్నారు.